క్లుప్తంగా

పేపర్ లీకేజ్ కేసులో 2వ నిందితుడు బెయిల్‌పై విడుదల

సైదాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో 2వ నిందితుడు బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యాడు. పేపర్ లీకేజీ కేసులో మార్చి నెలలో అరెస్టయి చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న రాజశేఖర్‌రెడ్డికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. దాంతో శుక్రవారం సాయంత్రం ఆయన చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు.

ఏపీపీగా చామల వినత నియామకం



రంగారెడ్డి కోర్టులు: రంగారెడ్డి జిల్లా 5వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు ఏపీపీగా చామల వినతను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆమెను న్యాయవాద పరస్పర సహకార సంఘం సంచాలకుడు బాచిరెడ్డి శాయిరెడ్డి, పోక్సో కోర్టు స్పెషల్ పీపీ సునీత బర్ల శాలువాతో సత్కరించారు. తనను ఏపీపీగా నియమించినందుకు వినత ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

సైదాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చక్రపాణి



సైదాబాద్: సైదాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బి.చక్రపాణి నియమితులయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన సైదాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలతో కలిసి కృషి చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పార్టీ ఎవరికి అవకాశం ఇచ్చినా గెలిపించుకుంటామన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే



రవీంద్ర భారతి పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్‌తో విద్యార్థులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ వెంకటరమణ కాలనీలోని రవీంద్ర భారతి పాఠశాలలో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ గ్రాండ్ పేరెంట్స్‌కు పాద పూజ చేసి ఆశీస్సులు తీసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాళ్లు సత్యనారాయణ, సందీప్ గ్రాండ్ పేరెంట్స్ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీన్ జ్యోతి, డీఏ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంధ బాలికలం.. ఆదుకోండి సార్!

- ఆహారం, వసతుల కోసం రోడ్డుపై నిరసన
- బాలికలకు మద్దతుగా బైఠాయించిన సైదాబాద్ కార్పొరేటర్



సైదాబాద్: ప్రభుత్వ వసతి గృహంలో సరైన ఆహారం, వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నాం... మమ్మల్ని ఆదుకోండి సార్ అంటూ అంధ బాలికలు రోడ్డెక్కారు. వార్డెన్ వేధింపులు తాళలేక పోతున్నాం ఉన్నతాధికారులు మాకు న్యాయం చేయాలంటూ వారు నిరసనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి... సైదాబాద్ డివిజన్ బీ–బ్లాక్ క్వార్టర్స్‌లోని ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహంలో 67 మంది బాలికలు వసతి పొందుతున్నారు. హాస్టల్ సమస్యలకు నిలయంగా మారిందని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారని, ఇదేంటని అడిగితే ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్న భోజనం కూడా నాణ్యత లేకుండా వడ్డించడంతో బాలికలు భోజనం మానేసి సైదాబాద్–సరూర్‌నగర్ రహదారిపైకి చేరుకొని నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి అక్కడికి చేరుకొని వారిని తిరిగి హాస్టల్ వద్దకు తీసుకెళ్లి హాస్టల్ ఎదుట వారితో కలిసి బైఠాయించారు. ఉన్నతాధికారులు వచ్చే వరకు నిరసన విరమించేది లేదని వారు భీష్మించి అక్కడే కూర్చున్నారు. వారికి మద్దతుగా వచ్చిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి దివ్యాంగుల శాఖ ఏడీఈ రాజేందర్‌తో సెల్‌ఫోన్‌లో బాలికలతో మాట్లాడించారు. సోమవారం హాస్టల్‌ను సందర్శించి బాలికల సమస్యలపై సత్వరమే నిర్ణయం తీసుకుంటామని ఏడీఈ హామీ ఇవ్వటంతో అంధ బాలికలు నిరసన విరమించారు.

118 జీఓలో తప్పులు సవరించండి

రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వినతి



నవీన్ మిట్టల్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: 118 జీఓలో సవరణల గురించి శుక్రవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌ను ఆయన కార్యాలయంలో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, 118జీఓ కింద ఇచ్చిన పత్రాల్లో తప్పులు ఉన్నాయని, సరిహద్దులు, చిరునామాలు, చిన్న చిన్న తప్పులు వచ్చాయని, వెంటనే సవరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో 118జీఓ కింద దరఖాస్తు చేసుకున్న వారికి కూడా నోటీసులు రాలేదని, కనీసం విచారణ చేయలేదని తెలిపారు. అలాగే ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్‌కు కూడా చర్యలు తీసుకోవాలని, ప్లాట్ల యజమానులందరూ డబ్బులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. అధికారులు పలు దరఖాస్తులను తిరస్కరించారని, వాటిని కూడా పరిష్కరించాలన్నారు.ప్రభుత్వ తప్పిదం కారణంగానే పత్రాలలో తప్పులు వచ్చినందను ఎలాంటి రుసుం లేకుండా తప్పులను సవరించాలని కోరారు.బ్యాంక్ లోన్లు వచ్చే విధంగా బ్యాంక్‌ల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని నవీన్ మిట్టల్‌ను సుధీర్ రెడ్డి కోరారు. ప్రభుత్వ తప్పిదం కారణంగా పత్రాల్లో వచ్చిన తప్పులపై రెండు రోజుల్లో కలెక్టర్లతో మాట్లాడి దర్యాప్తు చేయించి ఎలాంటి రుసుం లేకుండా తప్పులు సవరించేలా చర్యలు తీసుకుంటామని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో నాయకులు అరవింద్‌రెడ్డి, రాంబాబు, శరత్‌రెడ్డి, అంజిరెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

మంత్రిపై తప్పుడు ప్రచారం చేస్తే సహించం

మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న రవిందర్‌శర్మ, బాలకిషన్, నగేష్

దిల్‌సుఖ్‌నగర్: మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శులు మూరుకుంట్ల అరవింద్ శర్మ, బేర బాలకిషన్ హెచ్చరించారు. శుక్రవారం వారు ఆర్‌కేపురం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. భారత్ జూడో యాత్ర ఏడాది పూర్తైన సందర్భంగా సరూర్‌నగర్ నుంచి ఆర్‌కేపురంలోని ఎన్టీఆర్‌నగర్ వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపట్టిన పాదయాత్రలో మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అవగాహన లేకుండా మధుయాష్కి మాట్లాడిన కల్ల బొల్లి మాటలను ప్రజలు వినే స్థితిలో లేరన్నారు. కోట్లాది నిధులతో మహేశ్వరం నియోజకవర్గంలో అర్బన్ డెవలప్‌మెంట్ పార్కులు, మెడికల్ కాలేజీ, డిగ్రీ కళాశాలలు, మోడల్, గురుకుల పాఠశాలలు, తుక్కుగూడలో ఐటీ కంపెనీలు, ఫార్మసిటీ లాంటి పెద్ద కంపెనీలను తీసుకొచ్చి ఎంతోమందికి ఉపాధి కల్పించారన్నారు. సబితా ఇంద్రారెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కాంగ్రెస్, బీజేపీ నాయకులకు కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే అభివృద్ధిపై చర్చకు రావాలని అరవింద్ శర్మ, బేర బాలకిషన్ సవాల్ విసిరారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, మహేశ్వరం నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ దుబ్బాక శేఖర్, గొడుగు శ్రీనివాస్, న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, రామాచారి, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, వల్లూరి రమేష్,పాషా, మైసయ్య పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఎల్‌బీనగర్: కాలనీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని ఏపీఆర్ క్రిస్టల్ ఎవెన్యూ కాలనీలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు శుక్రవారం మరమ్మతు చేపట్టారు. ఆ పనులను పరిశీలించిన కార్పొరేటర్.. వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీల్లో పనులను శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ రాకేష్, బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

దుర్గాదేవికి స్వర్ణకవచ అలంకరణ



మన్సూరాబాద్: నాగోలు డివిజన్ శ్రీసాయినగర్ కాలనీలోని శ్రీదుర్గాదేవి ఆలయంలోని అమ్మవారికి శుక్రవారం స్వర్ణకవచ అలంకరణ చేశారు. సమీప కాలనీల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పోచబోయిన గణేష్‌యాదవ్, అర్చకులు మురళీ శర్మ, సభ్యులు యాదగిరి, హనుమంతరావు, రవి, మురళి, రమణమూర్తి, కృష్ణమూర్తి, కేశవులు పాల్గొన్నారు.

హామీలు నెలబెట్టుకోని ముఖ్యమంత్రి: అందెల



దిల్‌సుఖ్‌నగర్: ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిలబెట్టుకోలేక పోయారని, అభివృద్ధి పేరుతో కారెక్కిన మంత్రి సబితమ్మ సైతం ప్రజా సమస్యలను గాలికొదిలేసి ఎంఐఎం పార్టీ సేవలో ఓట్ల రాజకీయం చేస్తున్నారని బీజేపీ మహేశ్వరం అసెంబ్లీ ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములు, ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి విమర్శించారు. ఆర్కేపురం డివిజన్‌లో శ్రీరాములు చేపట్టిన గడప గడపకూ బీజేపీ కార్యక్రమం శుక్రవారం సౌభాగ్యపురం కాలనీలో కొనసాగింది. కార్పొరేటర్ రాధ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి, దేశ సంక్షేమాన్ని వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా అందెల శ్రీరాములు మాట్లాడుతూ, పేదలకు ఇవ్వాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారికి ఇవ్వకుండా ఓ వర్గానికి కట్టబెడుతోందని ఆరోపించారు. 'డబుల్' ఇళ్లు మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు దక్కే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. పాదయాత్రలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధీరజ్ రెడ్డి, పిట్ట ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ముంతా రాములు, సిద్ధూ ముదిరాజ్, వెంకటరెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్, కరుణ పాల్గొన్నారు.

ప్రత్యంగిరా దేవిని దర్శించుకున్న శేఖర్ మాస్టర్



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం కుర్తాళం పీఠంలోని ప్రత్యంగిరా పరమేశ్వరి దేవిని ప్రముఖ చలన చిత్ర కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాస్టర్ మాట్లాడుతూ, ప్రత్యంగిరా దేవి చాలా మహిమగల దేవతని, అమ్మవారిని తాను తరచూ దర్శించుకుంటానని తెలిపారు. ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ సువర్ణలత దంపతులు శేఖర్ మాస్టర్‌కు అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో విఠల్ శర్మ, అరుణ, సాయికుమార్ శర్మ, హేమ, రామశర్మ పాల్గొన్నారు.

గృహిణి ఆత్మ'హత్య'?

- అల్లుడే చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని మృతురాలి తండ్రి ఫిర్యాదు

నాగోలు: అనుమానాస్పద స్థితిలో గృహిణి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగోల్ ఠాణా పరిధిలోని బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, మృతురాలి తండ్రి కథనం ప్రకారం...ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంకు చెందిన సంధ్య (22)కు అదే ప్రాంతం చింతల తండాకు చెందిన బానోత్ హుస్సేన్ (30)కు 2020 జూన్ 6న పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కుమారుడు, 9 నెలల కుమారుడు ఉన్నారు. కొద్ది రోజులుగా హుస్సేన్ మద్యం తాగి ఆలస్యంగా ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. గొడవ జరిగిన ప్రతిసారి సంధ్యను హుస్సేన్ చితకబాదేవాడు. బుధవారం రాత్రి కూడా హుస్సేన్ మద్యం తాగి ఇంటికి రావడంతో భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవ జరిగింది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన సంధ్య ఇంట్లోకి వెళ్లి ఉరేసుకుంది. ఇది గమనించిన హుస్సేన్ వెంటనే భార్యను కిందకు దించి కామినేని హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. అనంతరం హుస్సేన్ మృతురాలి తండ్రి లక్ష్మణ్‌కు ఫోన్ చేసి సంధ్య ఉరేసుకుందని చెప్పాడు. హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్న తండ్రి మిగతజీవిగా పడి ఉన్న కూతుర్ని చూసి కన్నీరు మున్నీరయ్యాడు. ఒంటిపై గాయాలను గమనించిన అతను తన కూతుర్ని అల్లుడు చితకబాది ఉరేసి హత్య చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నాగోల్ పోలీసులు వరకట్నం వేధింపులతో పాటు ఐపీసీ సెక్షన్ 306 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీహార్ నుంచి గంజాయి తెచ్చి విక్రయం: ఒకరి అరెస్టు

నాగోలు: బీహార్ నుంచి అక్రమంగా గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని చౌటుప్పల్ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి మూడు కేజీల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రం మహాదేవ్‌పూర్‌కు చెందిన లాలూదాస్(25) కొన్నేళ్లుగా యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దేవులమ్మ నాగారంలో నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా ఇతను తన సొంత రాష్ట్రం బీహార్ నుంచి గంజాయి తీసుకొచ్చి చౌటుప్పల్ ప్రాంతంలో విక్రయిస్తున్నాడు. రాత్రి సమయంలో వెహికల్ చెకింగ్ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న లాలూ దాసును పోలీసులు అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా యాదగిరిగుట్ట పీఎస్ పరిధిలో 2.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం కొనసాగుతుందని, అమ్మేవారు, కొనుగోలుదార్లపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని సీపీ అన్నారు. సమావేశంలో చౌటుప్పల్ డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి.. గొలుసు స్నాచింగ్

ఆరు గంటల వ్యవధిలోనే నిందితుడి పట్టివేత

నాగోలు: నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని కత్తితో బెదిరించి.. బంగారు గొలుసు స్నాచింగ్ చేసిన దొంగను పోచంపల్లి పోలీసులు, ఇతర అధికారులతో కలిసిపట్టుకున్నారు. ఘటన జరిగిన 6 గంటల వ్యవధిలోనే నిందితుడిని అరెస్టు చేసి, సొత్తు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం..చౌటుప్పల్ మండలం, గుండ్లబావి(వి)కు చెందిన చిడుగుల నరేష్ హయత్‌నగర్‌లో ఉంటూ ఆర్‌టీఏ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. మద్యపానం, ఆన్‌లైన్‌లో పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. తన బంధువుల వద్ద అప్పు తీసుకొని ఆన్‌లైన్ పేకాట, బెట్టింగ్‌లకు పాల్పడి రూ. 20 లక్షలు పోగొట్టుకున్నాడు. తన తల్లి, భార్య పుస్తెలతాడు కుదవపెట్టి మరీ ఆన్‌లైన్ పేకాటాడి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక సమస్యలు ఎక్కువ కావడంతో సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. సోషల్ మీడియాలో (యూట్యూబ్, ఫేస్‌బుక్) మీడియోలు చూసి మహిళ గొలుసులు చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. పోచంపల్లి మండలం, జబ్లక్‌పల్లికి చెందిన లక్ష్మమ్మ(65) గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన గ్రామంలోని వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా, నరేష్ ద్విచక్ర వాహనంపై వెళ్లి ఆమెను కత్తితో బెదిరించి మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని హయత్‌నగర్‌లోని స్వాతిబార్, రెస్టారెంట్‌లో అరెస్టు చేసి అతని వద్ద నుంచి బంగారు గొలుసు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీనియర్ సిటిజెన్స్ భవనంలో అభివృద్ధి పనులు ప్రారంభించిన కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: సీనియర్ సిటిజెన్స్ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలోని సీనియర్ సిటిజెన్స్ సంక్షేమ సంఘం భవనంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, సీనియర్ సిటిజెన్స్ భవనంలో చేపట్టే పనుల్లో కచ్చితంగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సీనియర్ సిటిజెన్స్ తమ అనుభవ పాఠాలతో నేటి యువతకు మార్గదర్శకం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, సీనియర్ సిటిజెన్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు గున్న మహేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణరావు, సోమయ్య, విశ్వేశ్వరరావు, పాండురంగం పాల్గొన్నారు.

'మేరా మిట్టీ- మేరా దేశ్'లో అందరూ భాగస్వాములు కావాలి



హస్తినాపురం సెంట్రల్ కాలనీలో మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

హస్తినాపురం: ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించేందుకు గడప గడపకూ బీజేపీ శ్రేణులు తిరుగుతున్నాయని మేరా మిట్టీ–మేరా దేశ్ ప్రచారోద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్‌లోని సెంట్రల్ కాలనీ, షిరిడీ సాయినగర్‌కాలనీలో అమృత కలశ్‌యాత్రను సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి అమృత కలశంతో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, మట్టికి సెల్యూట్ అమరవీరులకు వందనం అనే నినాదంతో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధులు, వీరులను గౌరవించడమే మేరా మిట్టీ–మేరా దేశ్ ప్రచార లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్, శాంతిమిత్ర, రాజేంద్ర ప్రసాద్, జగన్‌మోహన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, జీవన్ రెడ్డి, రాధాకృష్ణ, శిరీషా, సాయికృష్ణ, మల్లేష్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వెంటనే 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి: సీపీఎం



హయత్‌నగర్ సర్కిల్ డీసీకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

లింగోజిగూడ: ఇళ్లు లేని పేదలకు ఇళ్లు ఇస్తామని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గత 9 ఏళ్లుగా మోసం చేస్తున్నాయని సీపీఎం నాయకులు ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన వాగ్దానాలను నెరవేర్చాలని శుక్రవారం సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ మండల కార్యాలయం, ఎల్‌బీనగర్ ముడు సర్కిళ్ల కార్యాలయంలో ధర్నా నిర్వహించి ఎంఆర్‌ఓ, డీసీలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ, పేదల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, నిత్యావసరాల ధరలను వెంటనే నియంత్రించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు వెంటనే తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఎల్లయ్య, సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సీహెచ్ వెంకన్న, నాయకులు వీరయ్య, గోపి, రాములు, పాండునాయక్, లక్ష్మణ్, మున్నా, శ్రీరాములు, చంద్రకళ, శాంతి, ప్రేమ, లింగమ్మ, సైదులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి

ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

సైదాబాద్: విద్యార్థులు, యువత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు సూచించారు. శుక్రవారం చంచల్‌గూడలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, సైదాబాద్‌లోని సెయింట్ మాజ్ స్కూళ్లలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనదారులు అందరూ ట్రాఫిక్ సిబ్బందికి సహకరిస్తూ వారి సూచనలు, ఆదేశాలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ముఖ్యంగా యువత సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం, రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు చేయడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరిగాయన్నారు. రహదారులపై వాహనదారులు అందరూ క్రమశిక్షణగా వ్యవహరించాలని ఏసీపీ సూచించారు. సమావేశంలో ఇనిస్టిట్యూట్ సిబ్బంది శ్రీధర్, కృష్ణ, ప్రసాద్, చిరంజీవి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలని వినతి



జీఎం శ్రీనివాస్ రెడ్డిని సన్మానిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: జలమండలి హయత్‌నగర్ సర్కిల్ నూతన జీఎం శ్రీనివాస్‌రెడ్డిని శుక్రవారం బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి వాటర్ వర్క్స్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎంను శాలువాతో సన్మానించిన కార్పొరేటర్.. డివిజన్‌లో నెలకొన్న తాగునీటి సమస్యలు పరిష్కరించి డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గతంలో పని చేసిన జీఎం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ డివిజన్లలో రాజకీయాలు చేసేవారని ఆరోపించారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ మెట్టుపల్లి సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

వాటర్ పైప్‌లైన్ పనులు త్వరగా ప్రారంభించండి

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో మిగిలి ఉన్న వాటర్ పైప్‌లైన్ పనులను త్వరగా ప్రారంభించాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. జీఎం శ్రీనివాస్‌రెడ్డిను శుక్రవారం ప్రశాంత్ నగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాలనీల్లో చేపట్టాల్సిన పనులపై వినతిపత్రం అందజేశారు. నాయకులు ఎర్రవెల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి చోరీలు

- నలుగురు ముఠా సభ్యుల అరెస్టు
- రూ. 50 లక్షల సొత్తు స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ చౌహాన్



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న సీపీ

నాగోలు: ఆన్‌లైన్ గేమ్‌లు, దురలవాట్లకు బానిసై సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీల బాటపట్టిన నలుగురు ముఠా సభ్యులను కీసర పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 50 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, ల్యాప్‌టాప్, కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం... తమిళనాడు రాష్ట్రం, తిరునల్వేలి జిల్లా, నంగునేరికి చెందిన రామకృష్ణన్(35) పాత నేరస్తుడు. కొంత కాలం క్రితం హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌కు వలస వచ్చి చిరుధాన్యాల వ్యాపారం ప్రారంభించాడు. అదే ప్రాంతంలోని దేవేంద్రనగర్ కాలనీ చెందిన కాగ్ గోవింద్(36) స్థానికంగా బఠాణీలు, మరమరాలు వంటివి విక్రయించే షాపు నిర్వహిస్తున్నాడు.

- రామకృష్ణన్ తరుచూ గోవింద్ షాపు వద్దకు వచ్చేవాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి ఆన్‌లైన్ గేమ్‌లు ఆడేవారు. ఇద్దరూ పలు దురలవాట్లకు బానిసయ్యారు. అవసరమైన డబ్బులను సులువుగా సంపాదించేందుకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు.
- రామకృష్ణన్ తాను చోరీలు చేస్తానని, చోరీ సొత్తును ఇతర ప్రాంతాల్లో విక్రయించాలని గోవింద్‌కు పురమాయించాడు. రామకృష్ణన్‌కు కీసర, కుషాయిగూడ, జవహర్‌నగర్ పరిధిలోని ప్రాంతాలపై అవగాహన ఉండటంతో అక్కడ చోరీలు మొదలెట్టాడు.
- వీరికి అదే ప్రాంతానికి చెందిన బైక్ మెకానిక్ మహేందర్ పవార్(36), బాలాజీనగర్‌లో జ్యువెలరీ వర్క్ షాపు నిర్వహిస్తున్న బచ్చు సంతోష్(40) జత కలిశారు. రామకృష్ణన్ చోరీ చేసిన బంగారాన్ని గోవింద్‌కు ఇస్తే.. దానిని అతను మహేందర్ పవార్, సంతోష్‌లకు ఇచ్చి ఇతర ప్రాంతాల్లో అమ్మించేవాడు. వచ్చిన డబ్బును నలుగురూ పంచుకొనేవారు.
- రామకృష్ణన్ మంకీ క్యాప్, మాస్కు ధరించి తెల్లవారు జామున 3 నుంచి 4 గంటల సమయంలో బైక్‌పై కాలనీలో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి దొంగతనం చేసేవాడు.

బంధువుల ఇంట్లోనే దొంగతనం..

మహేందర్ పవార్ తన బంధువుల ఫంక్షన్‌కు వెళ్లాడు. ఈ విషయంపై రామకృష్ణన్‌కు సమాచారం ఇచ్చిన అతను బంధువుల ఇంట్లో ఎవ్వరూ లేరని, తాళం వేసి ఉందని చోరీ చేయమని చెప్పాడు. దీంతో రామకృష్ణన్ ఆ ఇంటి తాళం పగులగొట్టి లాకర్‌లో ఉన్న బంగారం, వెండి ఆభరణాలను చోరీ చేశారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కీసర పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను సోమవారం తెల్లవారుజామున అరెస్టుచేశారు. వారి వద్ద నుంచి రూ. 50 లక్షల విలువైన బంగారం, వెండితో పాటు ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. రామకృష్ణన్‌పై 22 చోరీ కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. సమావేశంలో మల్కాజిగిరి ఎస్ఓటీ డీసీపీ గిరిధర్, కుషాయిగూడ ఏసీపీడీసీపీ వెంకట్‌రెడ్డి, కీసర సీఐ వెంకటయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.